క్లుప్తంగా

పారదర్శకంగా ఓటర్ల జాబితాలు రూపొందించాలి

బొబ్బిలి: జనవరి 1, 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చాలని, కొత్తగా ఓటు నమోదుకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో వచ్చే దరఖాస్తులను స్వీకరించాలని ఆర్డీఓ ఎ.సాయిశ్రీ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో సోమవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. నూతన ఓటర్ల జాబితా సవరణ, నమోదులో పాటించాల్సిన నియమ నిబంధనలను వివరించారు. కొత్త ఓటర్ల చేర్పు మరింత వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, ఉప తహసీల్దార్ బలివాడ గౌరీశంకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

బొబ్బిలి: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వచ్చే నెల 9న నిర్వహించనున్న జాతీయ లోక్అదాలత్ విజయవంతం అయ్యేలా న్యాయవాదులంతా కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ పిలుపునిచ్చారు. స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్ పరిధిలోకి వచ్చే కేసులను గుర్తించి కక్షిదారులకు సమాచారం ఇవ్వాలని, వారిని చైతన్యం చేయాలని కోరారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి సౌమ్యా జోసెఫిన్, బార్ అధ్యక్ష, కార్యదర్శులు గంటి గోపాలకృష్ణశర్మ, తమ్మిరెడ్డి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి

రాజాం: గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపీపీ లావేటి సులోచన సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్మాణ దశలో ఉన్న సచివాలయ భవనాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలని, గడపగడపకు నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయించి, సామూహిక గృహప్రవేశాలకు లబ్ధిదారులను సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణిలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సులలో ఉచిత శిక్షణ

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో నిరుద్యోగ యువతకు ఉపాధి కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ వంశీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డేటాఎంట్రీ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్, టూ వీలర్ సర్వీస్ వంటి వాటిలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు ఆధార్‌కార్డు, 10వ తరగతి సర్టిఫికెట్ జిరాక్స్‌లను తీసుకుని ఐటీఐలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7286042743, 8121450657 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

బొబ్బిలిలో..

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో స్వల్పకాలిక ఉపాధి కోర్సులలో చేరేందుకు నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జీవీ రమణారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేట్ ఎలక్ట్రీషియన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండి, పదో తరగతి లేదా తత్సమాన అర్హత ఉన్న నిరుద్యోగ అభ్యర్థులు పాస్‌ఫొటో, ఆధార్ కార్డు, అర్హతలు తెలిపే ధ్రువపత్రాలతో ఐటీఐలో సంప్రదించాలని కోరారు.

అమ్మఒడితో విద్యా వెలుగులు

రాజాం/సంతకవిటి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడి పథకం పేదల కుటుంబాల్లో చదువుల వెలుగు నింపిందని ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింహాచలం అన్నారు. రాజాం, సంతకవిటి మండలాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ స్కూల్స్ జిల్లా అసోసియేషన్‌తో పాటు రాజాం, సంతకవిటి మండలాలకు చెందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయులు ఆయన్ను సత్కరించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రైవేట్ స్కూల్స్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. ఈనెల 17న విజయవాడలో ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి ప్రైవేట్ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని కోరామని, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ విజయనగరం జిల్లా అధ్యక్షుడు గట్టి పాపారావు, రాజాం నియోజకవర్గ అధ్యక్షుడు కె.సత్యనారాయణ, కార్యదర్శి ఈశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు కె.బసవరాజు, సత్యనారాయణ, మురళీ, జగన్నాథం, తారకేశ్వరరావు పాల్గొన్నారు.

నాణ్యమైన ఉత్పత్తులు సృష్టించాలి

బొబ్బిలి: నాణ్యమైన సేంద్రియ ఉత్పత్తులను సృష్టించేందుకు అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని గుంటూరు సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ పర్యవేక్షకులు డాక్టర్ ఎస్.రవికుమార్ అన్నారు. మండలంలోని కారాడలో సోమవారం 'పొలం బడి' నిర్వహించారు. సేంద్రియ విధానంలో పండించిన వరిక్షేత్రాలను పరిశీలించారు. సేంద్రియ ఉత్పత్తులకు ధ్రువీకరణ సర్టిఫికెట్ జారీ విధానంపై అవగాహన కల్పించారు. బొబ్బిలి వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యాంసుందర్, ఆర్‌బీకే సహాయకులు పాల్గొన్నారు.

శివోహం..

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- శివ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శివ నామస్మరణతో ఆలయాలు మార్మోగిపోయాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.



బొబ్బిలి: దిబ్బవీధి శివాలయం వద్ద బారులుతీరిన భక్తులు



వంగర: సంగాం సంగమేశ్వర స్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న భక్తులు



బాడంగి: భీమవరం కాశీవిశ్వేశ్వరాలయంలో అభిషేకాలు చేస్తున్న అర్చకులు మార్కెండేయులు



బొబ్బిలి: అలజంగి కాశీవిశ్వేశ్వరాలయంలో భక్తుల పూజలు



రాజాం: మల్లికార్జునస్వామి ఆలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు



రాజాం సిటీ: పొగిరి శివలింగ రుద్రేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రామభద్రపురం: ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రేగిడి: భక్తులతో కిటకిటలాడుతున్న సంకిలి శివాలయం



సంతకవిటి: పోతులజగ్గుపేటలో పూజలు చేస్తున్న భక్తులు



బొబ్బిలి: తారకరామా కాలనీలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ అజెండా

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అజెండా అని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని బూసాయవలస గ్రామంలో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతీ గడపకు వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతీ హామీని అమలు చేసి ప్రతీ గడపలో సంతోషాన్ని నింపిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి చంద్రబాబు అండ్ కో ఓర్వలేక బురదజల్లే ప్రయత్నం చేస్తోందన్నారు. అబద్ధాలు, మభ్యపెట్టే మాటలు చెప్పడం వారి నైజమన్నారు. ప్రజలకు మంచి చేయాలన్న తాపత్రయం టీడీపీకి లేదన్నారు. ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు. ఎవరెన్ని మాయమాటలు చెప్పినా 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, గ్రామ నాయకులు గంట పోలినాయుడు, కనిమెరక గణేష్, తదితరులు పాల్గొన్నారు.



బూసాయవలసలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

సీఎం జగన్ రైతన్న పక్షపాతి

రామభద్రపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని నాయుడువలసలో నిర్మించిన ఆర్బీకే భవనం, జీజీఎంపీ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, బూసాయవలసలో సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్‌ను ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. గ్రామాల్లో సచివాలయాలు నిర్మించి ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేశారన్నారు. సంక్షేమ పథకాల మంజూరులో పూర్తి పారదర్శకత పాటిస్తున్నారన్నారు. అన్నదాతలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉందన్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, రబీలో విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా ముందస్తుగా ఇండెంట్ పెట్టాలని వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, సర్పంచ్ నడిమింటి లక్ష్మి, వైస్ సర్పంచ్ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ప్రతినిధి అప్పికొండ నిర్మల, లెంక శ్రీనివాసరావు, తాత్రాసు రామకృష్ణ, పీఆర్ డీఈఈ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బస్సుయాత్ర విజయవంతం చేయాలి

బాడంగి: బొబ్బిలిలో ఈ నెల 23న జరగనున్న వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సుయాత్రలో అన్ని సామాజిక వర్గాలకు చెందిన ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మినాయుని వెంకటనాయుడు, పెద్దింటి రామారావు, జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, వైస్ ఎంపీపీ రమేష్ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం బస్సుయాత్రపై ప్రచారం చేపట్టారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలను బస్సుయాత్రలో పాల్గొనాలని ఆహ్వానాలు అందించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సామాజిక న్యాయం జరిగిందన్నారు.

బొబ్బిలి: ఈ నెల 23న వైఎస్సార్‌సీపీ చేపట్టే సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు శంబంగి వేణుగోపాలనాయుడు కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో, అలజంగిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశాలు నిర్వహించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన అన్ని సామాజిక వర్గాలకు చెందిన ప్రజలను బస్సుయాత్రకు తీసుకురావాలని కోరారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, మండల అధ్యక్షుడు ఉత్తరావిల్లి అప్పలనాయుడు, జేసీఎస్ ఇన్‌ఛార్జిలు రేజేటి ఈశ్వరరావు, తమ్మిరెడ్డి దామోదరరావు, తదితరులు ఉన్నారు.



బాడంగి: పీవీపేటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పక్కాగా కులగణన

రాష్ట్రంలోని అన్ని కులాలకు సమన్యాయం జరిగాలి. అట్టడుగు వర్గాల వారికి కూడా సంక్షేమ ఫలాలు అందాలి. ఇదే ఉద్దేశంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 27 నుంచి కులగణన చేపట్టేందుకు సిద్ధమైంది. దీనికి సంబంధించి సోమవారం అన్ని మండలాల్లో పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కులగణన ఏ విధంగా చేపట్టాలి, ఏయే వివరాలు సేకరించాలి, ఎలా నమోదు చేయాలి, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలని సూచించారు.

– సాక్షి బొబ్బిలి, రాజాం



రేగిడి: కులగణనపై శిక్షణ ఇస్తున్న రిసోర్సుపర్సన్ భాస్కరరావు



రాజాం సిటీ: శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా రిసోర్స్ పర్సన్ రామకృష్ణ



సంతకవిటి: కులగణనపై సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ భాస్కరరావు



మెంటాడ: కులగణనపై సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ కిషోర్‌కుమార్



బాడంగి: ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయులు

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ఈ నెల 14 నుంచి నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిసాయి. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల ఆవశ్యకతను వక్తలు విద్యార్థులకు వివరించారు. పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని, యువత గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్



బాడంగి: విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్‌ఐ రమేష్



రాజాం: శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ వై.దుర్గారావు, తదితరులు



రామభద్రపురం: శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ రామకృష్ణ



రేగిడి: విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ శ్యామలకుమారి, అధికారులు



సంతకవిటి: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీటీసీ పి.శంకరరావు, లైబ్రేరియన్ శ్రీదేవి



మెంటాడ: చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీటీసీ పతివాడ కుమారి, తదితరులు

ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేయాలి

సంతకవిటి: రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం కె.మీనాకుమారి అన్నారు. మండల కేంద్రంలోని ఉపాధిహామీ కార్యాలయంలో సోమవారం వీఏఏలకు, టీఏలకు ధాన్యం కొనుగోలుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించిన సివిల్‌సప్లై డీఎం మీనాకుమారి మాట్లాడుతూ.. ఆర్‌బీకేల ద్వారా రైతుల నుంచి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ఇప్పటికే ఆర్‌బీకే సిబ్బందికి ధాన్యం సేకరణ లక్ష్యాలను నిర్దేశించినట్లు చెప్పారు. రైతులు బహిరంగ మార్కెట్లో ధాన్యం విక్రయిస్తే వారి సర్వే నంబరును బహిరంగ మార్కెట్ అమ్మకం (ఓఎంఎస్) కింద పోర్టల్‌లో బ్లాక్ చేయాలని సూచించారు. రైతు బయోమెట్రిక్ వేస్తేనే కొనుగోలు ప్రక్రియ జరుగుతుందన్నారు. రైతుల కళ్లాల వద్దకు వెళ్లి ధాన్యం శాంపిల్స్‌ను పరీక్షించాలని, ఆ తర్వాత షెడ్యూల్ ఇవ్వాలని, ఒకవేళ రీషెడ్యూల్ చేయాల్సి వస్తే 5వ రోజు తప్పనిసరిగా రీషెడ్యూల్ చేయాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి పైల నవీన్, సీఎస్‌డీటీ చిరంజీవి, టీఏలు, ఎఫ్ఏఓలు పాల్గొన్నారు.

రాజాం సిటీ: ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై వీఏఏలు, టీఏఎస్, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సివిల్‌సప్లై డీఎం కె.మీనాకుమారి ధాన్యం కొనుగోలు, తరలింపు, షెడ్యూలింగ్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు.

ఉత్సవంలా 'వై ఏపీ నీడ్స్ జగన్'

రాజాం: పట్టణంలో 24వ వార్డు బుచ్చింపేట సచివాలయం పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును ఎమ్మెల్యే కంబాల జోగులు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని, చేసిన అభివృద్ధిని తెలియజేశారు. గత టీడీపీ ప్రభుత్వ అరాచకాలు, మోసాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం ప్రధాన వీధిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎంవీ నాగరాజు, వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పిట్టా జగదీష్, కోరాడ రామినాయుడు, నమ్మి పార్వతీరావు, ముద్దాడ అప్పన్న, నమ్మి రాములు, కోరాడ రాము తదితరులు పాల్గొన్నారు. రాత్రి గ్రామానికి చెందిన కోరాడ రామినాయుడు ఇంట్లో ఎమ్మెల్యే జోగులు రాత్రి బస చేశారు. సోపేరులో జెడ్పీటీసీ బండి నర్సింహులు, పార్టీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, తదితరులు సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు.



రాజాం: బుచ్చింపేటలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

తెర్లాం: మండలంలోని వెలగవలసలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాల బోర్డును గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేశారు. గత టీడీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలకు వివరించారు. పార్టీ మండల అధ్యక్షుడు తెంటు సత్యం నాయుడు, ఎంపీపీ ఉమా బాబ్జీరావు, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, నాయకులు గర్బాపు రామారావు, ఫాల్గుణ, గిరి పాల్గొన్నారు.



రాజాం సిటీ: సోపేరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ బండి నర్సింహులు, లావేటి రాజగోపాలనాయుడు తదితరులు



తెర్లాం: వెలగవలసలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తున్న నాయకులు

సంక్షిప్తంగా..

20 లీటర్ల సారా స్వాధీనం

వంగర: మండలంలోని వీవీఆర్‌పేట గ్రామంలో సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్ఈబీ ఎస్సై ఎస్.పిచ్చేశ్వరరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సోమవారం సిబ్బందితో దాడులు నిర్వహించగా.. గ్రామానికి చెందిన బొత్స సుమన్ వద్ద 20 లీటర్ల సారా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భూదందాకు అడ్డుకట్ట వేయాలని వినతి

మెంటాడ: తాతల తండ్రుల కాలం నుంచి సాగు చేసుకుంటున్న తమ భూములను కమ్యునిస్ట్ పార్టీకి చెందిన ఓ నాయకుడు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, తన అనుచరులను పంపించి భూదందాకు పాల్పడుతున్నారని గుర్ల రెవెన్యూ గ్రామానికి చెందిన గిరిజనులు శిడగం సింహాచలం, ఎస్.సన్యాసిరావు, జి.చిన్నరాము, ఇ.అప్పలస్వామి, ఇ.సింహాచలం, ఇ.సోములు, పి.రామునాయుడు వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

ఆర్టీసీ ఆస్తుల పరిరక్షణే ధ్యేయం

రామభద్రపురం: ఆర్టీసీ ఆస్తులు పరిరక్షణే ధ్యేయమని ఆర్టీసీ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ తిరుపతిరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఆర్టీసీ ఆస్తులను ఎవరైనా ఆక్రమిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాంప్లెక్స్ ఆవరణంలోని ఖాళీ స్థలంలో దుకాణ సముదాయం నిర్మాణానికి ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

తెర్లాం: స్థానిక ఎస్సీ వీధిలో రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని కోరుతూ ఎంపీడీఓ ఎస్.రామకృష్ణకు కాలనీవాసులు సోమవారం వినతిపత్రం అందజేశారు. రోడ్డుపై బాత్‌రూంలు, మోటార్లు, చెత్తకుప్పలు వేయడంతో ప్రజలు నడిచేందుకు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ అన్నారు.

సమ్మె నోటీసు అందజేత

బొబ్బిలి: కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీల పట్ల వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా వచ్చే నెల 8 నుంచి సమ్మె నిర్వహించనున్నట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సంఘ నాయకులు తెలిపారు. ఈ మేరకు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ విజయలక్ష్మికి సోమవారం సమ్మె నోటీసులు అందజేశారు. సంఘ నాయకులు బి.నిర్మల, సీహెచ్ లక్ష్మి, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జనవరి 7న వెలమ గర్జన

మెంటాడ: విశాఖపట్నం వేదికగా జనవరి 7న నిర్వహించనున్న వెలమ గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర వెలమ సంఘం అధ్యక్షుడు లగుడు గోవిందరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. వెలమల హక్కుల కోసం, వెలమల ఐక్యత కోసం గర్జన కార్యక్రమం ఉంటుందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వెలమ కులానికి చెందిన ప్రతీ ఒక్కరు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. ఆయనతో పాటు పెదిరెడ్ల సత్యం, శ్రీనివాస్, దుర్గారావు, శ్రీధర్, తదితరులు ఉన్నారు.